క్లుప్తంగా

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కౌటాల: ప్రతి ఒక్కరూ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కౌటాల తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి అన్నారు. పీఎం జీవన జ్యోతి బీమా యోజన లబ్ధిదారుడికి శుక్రవారం బ్యాంకులో రూ.2 లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బీమా చేసుకోవాలని తెలిపారు. వినియోగదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సంఘాలు ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది మనోహర్, రాజేశ్, భాస్కర్, గోపి, రవి, కుసుమ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

‘నీటి ఎద్దడి నివారించండి’


మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణమూర్తి

కెరమెరి: నీటి ఎద్దడి లేకుండా నివారించాలని ఎంపీడీవో కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ టీఏ, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రానున్న వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, ప్రతీ గ్రామ పంచాయతీలో 50 మందికి పైగా కూలీలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో మల్లేశ్, ఈసీ ఐక్యానాయక్ తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వాంకిడి: మండలంలోని బెండార, వాంకిడి, బంబార పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో లోకేష్ కుమార్, తహసీల్దార్ డి.రోహిత్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. బంబార గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకొని చదువులో రాణించాలని విద్యార్థులకు సూచనలిచ్చారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ సదస్సుకు ఆహ్వానం


ఆత్రం మోతీరాం


సాయికుమార్

వాంకిడి: మండలానికి చెందిన యువ కవులు ఆత్రం మోతీరాం, కోట్నాక సాయికుమార్‌లు ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే కేంద్ర సాహిత్య అకాడమీ సదస్సుకు ఆహ్వానం అందుకున్నారు. ఈ నెల 21వ తేదీన కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవ వేడుకల్లో కవిత పఠనం చేయనున్నట్లు వారు తెలిపారు. ఆదివాసీ మౌఖిక జానపద సాహిత్యంతో పాటు మాతృ భాషలు కొలామి, గోండి భాషలలో కవితా పఠనం చేయనున్నట్లు పేర్కొన్నారు.

మూఢ నమ్మకాలపై అవగాహన

వాంకిడి: మండల కేంద్రంలోని కేజీబీవీ, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం విజ్ఞాన దర్శిని సంస్థ ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ దయ్యాలు, భూతాలు అనే మాటలు కట్టుకథలని, విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలన్నారు. సంస్థ సభ్యులు శోభారాణి, మహ్మద్ ఆలీ, మహేశ్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వాటర్ ఆపిల్స్ అందజేత


వాటర్ ఆపిల్స్ అందజేస్తున్న బాలాజీ

కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామానికి చెందిన రాష్ట్ర ఉత్తమ రైతు కేంద్రె బాలాజీ శుక్రవారం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వాటర్ ఆపిల్స్ అందించారు. తన ఆపిల్ పండ్ల తోటను సందర్శించాలని కలెక్టర్‌ను ఆహ్వానించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పెందోర్ జలపతిరావు ఉన్నారు.


రథాన్ని లాగుతున్న భక్తులు


జాతర మహోత్సవానికి హాజరైన భక్తజనం


రథోత్సవానికి ఉత్సవ విగ్రహాన్ని తీసుకెళ్తున్న భక్తులు


జాతరలో మహాత్ముని వేషధారణలో భక్తుడు

ఘనంగా బాలేశ్వరస్వామి రథోత్సవం

శ్రీపార్వతీ సమేత బాలేశ్వరస్వామి రథసప్తమి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు శ్రీధర్, అజయ్‌ల ఆధ్వర్యంలో నిత్యపూజలతో పాటు, అభిషేకం, మంగళ హారతి, మహా మంత్రపుష్పంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. జాతర సందర్భంగా వెలిసిన దుకాణాల్లో చిన్నారుల సందడి కన్పించింది. రాత్రి 9 గంటలకు భజనా కార్యక్రమాన్ని చేపట్టారు. దర్శనానికి జిల్లాతో పాటు మంచిర్యాల, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు. రథసప్తమి పురస్కరించుకొని ఆలయంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, సీఐ సతీశ్‌లు ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. – ఆసిఫాబాద్‌అర్బన్

‘పనులు సక్రమంగా జరిగేలా చూడాలి’

రెబ్బెన: ఈజీఎస్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులు సక్రమంగా జరిగేలా చూడాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన ఈజీఎస్ పనులపై శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో 14వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు 2022 –23 ఆర్థిక సంవత్సంలో చేపట్టిన పనులపై చేసిన తనిఖీ వివరాలను వెల్లడించారు. మండలంలో మొత్తం 463 పనులను రూ. 3.6కోట్ల వ్యయంతో చేపట్టినట్లు వెల్లడించారు. కూలీలకు వేతనాల రూపంలో రూ. 3.54 కోట్లు, మెటీరియల్స్ కోసం రూ. 6లక్షలు చెల్లించినట్లు తెలిపారు. కూలీలకు అదనంగా వేతనాల చెల్లింపులు, మొక్కలు నాటినట్లు రికార్డులో చూపడం, కూలీలకు చెల్లించాల్సిన వేతనాలు చెల్లించకపోవటం వంటి కారణాలతో టీఏలు, ఎఫ్ఏలు, ఈసీ, ఏపీవోల నుంచి రూ.36వేల రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. అదేవిధంగా రూ. 64 వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కృష్ణమూర్తి, ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, అంబుడ్స్ పర్సన్ సాయిశ్రీ, ఎంపీడీవో శంకరమ్మ, ఎంపీవో రాజేశ్వర్ గౌడ్, ఎస్ఆర్పీ భగవంత్‌రావు, ఏపీవోలు బుచ్చన్న, కల్పన పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి


దహెగాంలో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

దహెగాం: ఆటో డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఆటోల బంద్ సందర్భంగా మండల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం రాక ముందు ఆటో డ్రైవర్లకు జీవనోపాధి ఉండేదని, ప్రస్తుతం ప్రయాణికులు ఆటోల్లో ఎక్కడం లేదన్నారు. దీంతో ఆటోల ఫైనాన్స్ కిస్తీలు చెల్లించని పరిస్థితిలో ఉన్నామని వాపోయారు. ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కుంచవెల్లి ఆటో యూనియన్ సభ్యుడు శ్రీకాంత్, కల్వాడ యూనియన్ శంకర్, ఆటో డ్రైవర్లు లక్ష్మణ్, రవి, మహేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బీరప్పకు పూజలు

కౌటాల: మండలంలోని శీర్షా గ్రామంలో గల బీరప్ప స్వామి ఆలయం వద్ద గ్రామంలోని కుర్మ కులస్తులు శుక్రవారం బీరప్ప దేవునికి ప్రత్యేక పూజలు చేశారు. బీరప్ప పండుగ పురస్కరించుకొని గ్రామంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గుడోలు కళాకారులు చేసిన విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. బీరప్ప స్వామి పండుగ సందర్భంగా ఆలయంలో వారం రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం లగ్గం బోనాలు, ఆదివారం లగ్గం పట్నాలు, మంగళవారం నాగవెల్లి బోనాలు, గురువారం ఎట్టి ముల్లెలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శంకర్, పోశమల్లు, రాజులు, పర్వతాలు, అల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


ఒగ్గుదోలు కళాకారుల విన్యాసాలు

‘మరమ్మతులు చేపట్టి..లీకేజీలు ఆపండి’

సిర్పూర్(టి): చీలపెల్లి పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామం పూసిగూడలో శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పర్యటించారు. పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడి ఇళ్ల ఎదుట బురదమయంగా మారడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి లీకేజీలు ఆపాలని ఆదేశించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో కృష్ణమూర్తి ఉన్నారు.


పైపులైన్ లీకేజీలు పరిశీలిస్తున్న దీపక్ తివారి

క్రమశిక్షణతో ఉద్యోగం చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: ఉద్యోగం సాధించిన యువత క్రమ శిక్షణతో ఉండాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో కుమురం భీం స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది పోలీస్ ఉద్యోగం సాధించిన ఆరుగురిని అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీటీడీవో రమాదేవి, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఊశన్న, రాజశేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

అదనపు పీడీకి వీడ్కోలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా పేదరిక నిర్మూలన సంస్థ అదనపు పీడీ శ్రీనివాస్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని మండల సమైఖ్య కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. బదిలీల్లో భాగంగా ఆయన ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. డీపీఎంలు, ఏపీఎంలు, మండల సమైఖ్య ఓబీలు పాల్గొన్నారు.

డీపీఆర్‌వోకు సన్మానం

ఆసిఫాబాద్‌అర్బన్: బదిలీపై వెళ్తున్న ఆసిఫాబాద్ డీపీఆర్‌వో కృష్ణమూర్తిని, నూతన డీపీఆర్‌వోగా బాధ్యతలు స్వీకరించిన సంపత్‌లను శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీపీఆర్‌వో కార్యాలయంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


దహెగాం: మానవహారంలో కార్మికులు

దహెగాం: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ఆయా శాఖల్లో పని చేస్తున్న కార్మికులు కదం తొక్కారు. అన్ని రంగాల్లో పని చేస్తున్న కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశలు, పంచాయతీ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు తహసీల్దార్ కార్యాలయం నుంచి మార్కెట్ ప్రాంతం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కవితకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం మార్కెట్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జయప్రద, కన్వీనర్ రమేశ్, కోకన్వీనర్ వజ్రమ్మ, అన్ని రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని మండలంలోని కార్మికులు డిమాండ్ చేశారు. మండలంలోని ఆశ వర్కర్లు, డ్రైవర్లు, అంగన్‌వాడీ కార్మికులు శుక్రవారం దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అనంతరం డీటీ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలు, మతతత్వ ధోరణులతో దేశానికి తీరని నష్టం జరుగుతుందని ఆరోపించారు. భారత న్యాయ సంహిత, హిట్, రన్ సెక్షన్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.


కౌటాల: వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు


సిర్పూర్(టి): నిరసన తెలుపుతున్న కార్మికులు

సిర్పూర్(టి): కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండలంలోని వేంపల్లి గ్రామపంచాయతీ పరిధి కొలాంగూడ గ్రామస్తులు గ్రామీణ బంద్ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అఖిల భారత రైతు కూలి సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం హయాంలో రైతులకు, నిరుపేదలకు ఎలాంటి లాభం చేకూరలేదని ఆరోపించారు.

కెరమెరి: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఎండీఎం కార్మికులు రోడ్డుపై ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ మునావర్ షరీఫ్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ మండల కన్వీనర్ ఆనంద్‌రావు, నాయకులు గుణసుందరి, అనసూయ, మంజుల, తానుబాయి, విమలబాయి, సావిత్రిబాయి, అయ్యాబాయి తదితరులు ఉన్నారు.

రెబ్బెన: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చర్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. శుక్రవారం చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్, కనీస వేతనాల జీవోను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జగ్గయ్య, రాజేష్, కిరణ్‌బాబు, శేషు, దివాకర్, కృష్ణమోహన్, అంజయ్య, తిరుపతి, సుధాకర్ పాల్గొన్నారు.

గోలేటి సీహెచ్‌పీ వద్ద రాస్తారోకో

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు గోలేటి సీహెచ్‌పీ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఏఐటీయూసీ రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్, నాయకులు నర్సయ్య, స్వామి, లక్ష్మీనారాయణ, అశోక్, సాగర్‌గౌడ్, కార్మికులు సత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనాగరిక దాడి..

దేశంలో శ్రమిస్తున్న కార్మిక, కర్షక, రైతుల జీవితాలు, జీవనోపాధిపై కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనాగరిక దాడి చేస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా శుక్రవారం చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. నాయకులు స్వామి, రాజాగౌడ్, వెంకటేశ్వర్‌గౌడ్, కృష్ణ, తిరుపతి, సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది ధర్నా చేశారు. కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జైనూర్: దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఐకేపీ కార్మికులు సమ్మె చేపట్టారు.

తిర్యాణి: అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త బంద్‌లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ, ఆశ, గ్రామపంచాయతీ కార్మికులు, ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల మద్దతు

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి సమ్మెకు మద్దతు తెలిపారు. సంఘం నాయకులు ఇందులావు, నాయకులు హేమంత్, ఎల్లయ్య, తిరుపతి, శ్రీనివాస్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మానిక్ రావు, తుకారాం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 317 జీవోతో ఉపాధ్యాయులకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. సంఘం నాయకులు లక్ష్మణ్, భాస్కర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో వ్యాధులు దూరం

రెబ్బెన: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయని డాక్టర్ విశ్వనాథ మహర్షి అన్నారు. సింగరేణి సేవా సమితి, మాతా రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మోతుగూడ గ్రామంలో శుక్రవారం బ్రహ్మనందగిరి 123వ జన్మదినం సందర్భంగా ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రథతోత్సవంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు బ్రహ్మయ్య, రాజయ్య, దాదాజీ, వినోద్, మల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి

కెరమెరి: గుణాత్మక విద్యనందించి విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దాలని ఏటీడీవో పురుషోత్తం అన్నారు. శుక్రవారం మండలంలోని మోడి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మోడి, అనార్‌పల్లి, జైనూర్ మండలంలోని రాసిమెట్ట కాంప్లెక్స్‌లకు చెందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీసీడీవో శకుంతల, డీఆర్‌పీ వామన్‌రావు, హెచ్ఎంలు స్వర్ణలత, బలిరాం, పార్వతి తదితరులు ఉన్నారు.

పెంచికల్‌పేట్ ఎంపీడీవోగా గంగాసింగ్

పెంచికల్‌పేట్: మండల ఎంపీడీవో రమేశ్ కాగజ్‌నగర్ ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. కాగా ఆయన స్థానంలో శుక్రవారం ఎంపీడీవోగా గంగాసింగ్ బాధ్యతలు స్వీకరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న ప్రవీణ్ కుమార్

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన సిరిపురం ఈశ్వర్ గురువారం గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శుక్రవారం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు బిట్టి శ్రీనివాస్, దేవాజీ తదితరులు ఉన్నారు.